## క్లుప్తంగా

### బహిరంగ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



బడంగ్‌పేట నుంచి తరలి వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వంచిన 'విజయభేరీ' బహిరంగ సభకు బడంగ్‌పేట మున్సిపాలిటీ నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కార్పొరేషన్ పరిధి కుర్మల్‌గూడ, మల్లాపూర్, అల్మాస్‌గూడ, బడంగ్‌పేట్, బాలాపూర్, బాలాజీనగర్, మామిడిపల్లి, నాదర్‌గుల్, మల్లాపూర్, వెంకటాపూర్ తదితర ప్రాంతాల నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత ఆధ్వర్యంలో వేలాది మంది తరలివెళ్లారు.

### మోదీ జన్మదిన వేడుకలు



అనాథ ఆశ్రమంలో ప్రధాని జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

హుడాకాంప్లెక్స్: బీజేపీ కిసాన్‌మోర్చా రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి పోలోజి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం అనాథ ఆశ్రమంలో ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల మధ్య కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అర్బన్ అధ్యక్షుడు మహేశ్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆరుట్ల సురేష్‌కుమార్, గాజుల మధు, గోదా మల్లిఖార్జునగౌడ్, సాగర్, నాంపల్లి రవి, బన్నీ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.

### చెత్త రహిత పట్టణంగా..

ఆమనగల్లు: మున్సిపాలిటీని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దుదామని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ శ్యాంసుందర్ అన్నారు. ఇండియన్ స్వచ్ఛతా లీగ్ 2.0లో భాగంగా ఆదివారం పట్టణంలోని సురసముద్రం చెరువు వద్ద ప్రజా ప్రతినిదులు, కళాశాల విద్యార్థులు చెత్త తొలగించారు. పట్టణంలోని పలు కాలనీలలో రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు రాములు, లక్ష్మణ్, చెన్నకేశవులు, శ్రీకాంత్‌సింగ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**తుర్కయంజాల్‌లో..**

తుర్కయంజాల్: నీటి వనరులను పరిరక్షించుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ అన్నారు. చెరువుల్లో చెత్త, చెదారం, వ్యర్థాలు చేరకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. స్వచ్ఛతా లీగ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మున్సిపల్ కమిషనర్ సీ.హెచ్. శ్రీకాంత్‌తో కలిసి ఆమె మాసబ్ చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడారు. చెరువులపై ఆధారపడి ఎన్నో ప్రాణులు జీవిస్తాయని, వాటి మనుగడకు చెరువులు ఎంతో కీలకమన్నారు. కౌన్సిలర్లు మంగమ్మ, విజయానందరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ దర్శన్, సీనియర్ నాయకులు ధన్‌రాజ్ గౌడ్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో అభివృద్ధి

- దేశంలోనే ఆదర్శంగా తెలంగాణ
- ఏ రాష్ట్రంలో లేని పథకాలు మనవద్దే..
- మహనీయుల అడుగు జాడల్లో నడవాలి
- జాతీయ సమైక్యతా దినోత్సవంలో మంత్రి సబితారెడ్డి



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి సబితారెడ్డి

తుర్కయంజాల్: నాటి తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో సీఎం కేసీఆర్ సారథ్యంలో సాధించుకున్న రాష్ట్రం నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. కొంగరకలాన్‌లోని జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామిక స్వేచ్ఛ వైపు పరివర్తన చెందడానికి యావత్ తెలంగాణ సమాజం చేసిన కృషి ఎన్నటికీ మరువలేనిదన్నారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే ముందంజలో ఉన్నామన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా మరే రాష్ట్రంలో అమలులో లేవని గుర్తుచేశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని, విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు, దసరా కానుకగా ముఖ్యమంత్రి అల్పాహార పథకం ప్రారంభం కానుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసుకుని పంట పొలాలకు నీరందిస్తున్నామని, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలతో లక్షల ఎకరాల భూములు సాగులోకి రానున్నాయని తెలిపారు.

**త్యాగాల ఫలితమే తెలంగాణ**

ఎన్నో పోరాటాలు, త్యాగాల ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ సువిశాల భారతదేశంలో అంతర్భాగంగా మారిందని మంత్రి పేర్కొన్నారు. ఆదిలాబాద్ అడవుల్లో తుడుం దెబ్బ మోగించిన కొమురం భీమ్, భూస్వాముల ఆగడాలకు బలైన దొడ్డి కొమురయ్య, రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన రావి నారాయణ రెడ్డి, లోకమాన్య బాలగంగాధర్ తిలక్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి అడుగుపెట్టి హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌ను స్థాపించిన స్వామి రామానంద తీర్థ, భూ పోరాటాలకు ప్రేరణగా నిలిచిన చాకలి ఐలమ్మ, వందలాది ఎకరాల భూములను పేదలకు పంచిన మానవతావాది భీంరెడ్డి నర్సింహారెడ్డి, గీత కార్మికుల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసిన బొమ్మగాని ధర్మభిక్షం, ప్రజాపోరాటానికి సేనానిగా నిలిచిన ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి కమలాదేవితో పాటు సర్దార్ జమలాపురం కేశవ రావు, వట్టికోట అళ్వార్ స్వామి, దేవులపల్లి వెంకటేశ్వర రావు, బద్దం ఎల్లారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి, ప్రజాకవి కాళోజీ, మగ్దూం మొహియొద్దీన్, షోయబుల్లాఖాన్, బండి యాదగిరి, దాశరథి కృష్ణమాచార్య, సుద్దాల హనుమంతు వంటి వారంతా త్యాగాలతో చరిత్రను లిఖించారని వివరించారు. వారిని జాతి ఎప్పటికీ మరవదన్నారు. మహనీయుల అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి, కలెక్టర్ హరీశ్, అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు మనోహర్ రెడ్డి, కృష్ణారెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పటేల్‌తోనే తెలంగాణకు విముక్తి

- నిజాం నిరంకుశపాలనను అణచివేసిన ఉక్కుమనిషి
- తెలంగాణ విమోచన దినోత్సవంలో వక్తలు



మీర్‌పేటలో.. నర్సింహ తదితరులు

మీర్‌పేట: రజాకార్ల అరాచకాలు, నియంత పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించేందుకు నాడు ఉక్కుమనిషి, దేశ తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి ఎనలేనిదని, ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడుచు కోవాలని కార్పొరేటర్, బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవ సందర్భంగా తిరుమలహిల్స్ కాలనీలో ఆయన ఆదివారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఇందులో కార్పొరేటర్లు భిక్షపతిచారీ, కీసర హరినాథ్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌గౌడ్, కోశాధికారి విక్రమ్‌కుమార్, కాలనీ సభ్యులు నీలకంఠం, లక్ష్మీనారాయణ, రాజ్‌కుమార్ ఉన్నారు.

**ముమ్మాటికీ విమోచన దినమే..**

హుడాకాంప్లెక్స్: తెలంగాణ ప్రజల పోరాటాలకు వల్లభాయ్ పటేల్ ధీరత్వం తోడై నిజాం నిరంకుశ పాలన అంతమైందని సరూర్ నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. విమోచన దినోత్సవం సందర్భంగా అమరవీరుల త్యాగాలను స్మరించుకొంటూ సరూర్‌నగర్ పోలింగ్ బూత్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. నిజాం పాలన అంతంతో తెలంగాణ ప్రాంతం భారత యూనియన్‌లో విలీనమైన రోజైన సెప్టెంబరు 17.. తెలంగాణకు ముమ్మాటికీ విమోచన దినమేనన్నారు.



సరూర్‌నగర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన కార్పొరేటర్ శ్రీవాణి

# ఘనంగా విశ్వకర్మ జయంతి



కందుకూరులో విశ్వకర్మ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న విశ్వకర్మ సంఘం నాయకులు

కందుకూరు: విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని ఆ సంఘం మండల అధ్యక్షుడు కాసోజు ప్రశాంత్‌చారీ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి, ఘనంగా ఊరేగించారు. ఆ సంఘం నాయకులు సిరిగిరి సుదర్శన్‌చారీ, రామకృష్ణాచారీ, ముకుందాచారీ, సిరిగిరి జంగాచారీ, సిరిగిరి ఆనంద్‌చారీ, మధుసూదనాచారీ, గణేశ్‌చారీ, ఈశ్వర్‌చారీ, రామకృష్ణాచారీ, వీరాచారీ, సద్గుణాచారీ, ప్రవీణ్‌చారీ, బాలనరసింహాచారీ, సాయిచారీ, శివకుమార్‌చారీ, శేఖర్‌చారీ, శ్రీనివాస్ చారీ, నరసింహాచారీ ఉన్నారు.

**ఆకులమైలారంలో..**

ఆకులమైలారంలో శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు తల్లోజు వెంకటేష్‌చారీ, రమేష్‌చారీ, చంద్రమోహన్, నరేందర్‌చారీ, శేఖర్‌చారీ, ఆచారీ, రాజు, జగన్, విఘ్నేష్‌చారీ, గ్రామస్తులు శ్రీశైలం, గుర్రం యాదగిరి, జంగయ్య, యాదగిరి, శ్రీను పాల్గొన్నారు.

# బడుగులను మోసం చేసిన బీఆర్‌ఎస్



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కందుకూరు: సాయుధ పోరాటంతోనే తెలంగాణకు విముక్తి లభించిందని, ఆ పోరాటంలో ఎంతో మంది అమరులయ్యారని సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట ఉత్సవాల సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి 9 ఏళ్లు గడుస్తున్నా పేదలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాలను మోసం చేసిన బీఆర్‌ఎస్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కుమార్, బాల్‌రాజు, ఆర్.చందు, ఆర్.సతీష్, ఉన్ని సాయిలు, మధు, కాళిదాసు, శేఖర్, ఆంజనేయులు, జంగయ్య, అంజయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

# రూ.47 కోట్లతో చెరువుల సుందరీకరణ

- ప్రజలు సేదతీరేందుకు వాకింగ్ ట్రాక్‌లు
- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి
- సీడ్ గణపతి ప్రతిమలను పంపిణీ చేసిన మంత్రి



గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న మంత్రి

మీర్‌పేట: కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న పట్టణాల్లో ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు రూ.47 కోట్లతో మహేశ్వరం నియోజకవర్గంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 11 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి తెలిపారు. ఆదివారం మంత్రి మీర్‌పేటలోని చందన చెరువును పరిశీలించి వాకర్స్, సీనియర్ సిటిజన్లతో మాట్లాడారు. చెరువును సుందరీకరించడంతో పాటు పరిసర ప్రాంత వాసులు సేదతీరేందుకు వాకింగ్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్కు ఏర్పాటు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. అదే విధంగా చెరువు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని, దీంతో పాటు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పోలీసు, ఇతర ఉద్యోగాలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు వాకింగ్ ట్రాక్ ఎంతో ఉపయోగపడుతుందని, దానిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డీఈ గోపీనాథ్, మీర్‌పేట బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి పాల్గొన్నారు.

**గణపతి విగ్రహాల పంపిణీ**

మట్టి, సీడ్ గణపతి విగ్రహాలు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయని మంత్రి సబితారెడ్డి చెప్పారు. జిల్లెలగూడకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సిరూర్ బాలరాజు ఆధ్వర్యంలో వెయ్యి సీడ్ గణనాథులను మంత్రి పంపిణీ చేశారు.

### ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కందుకూరు: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడ సర్పంచ్ సాధ మల్లారెడ్డి సూచించారు. ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజును పురస్కరించుకొని ఆదివారం మండల పరిధి కొత్తగూడలో సర్పంచ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైదులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. అనారోగ్యం అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొక్క సత్యనారాయణరెడ్డి, దామోదర్‌రెడ్డి, బాలేష్ ముదిరాజ్, హన్మంత్‌రెడ్డి, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

# జడ్చర్ల, వనపర్తి ఇన్‌చార్జిగా పారిజాత



పారిజాతరెడ్డి

బడంగ్‌పేట్: కాంగ్రెస్ రాష్ట్ర అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులను ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. బాలాపూర్ గ్రామానికి చెందిన బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత రెడ్డిని మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల, నాగర్‌కర్నూల్ జిల్లా వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిగా నియమించారు. జడ్చర్లకు జాతీయ నాయకులు సచిన్ పైలట్, వనపర్తికి బీవీ. శ్రీనివాస్ (ఇండియన్ యూత్ కాంగ్రెస్ జాతీయ నాయకులు) పర్యవేక్షకులుగా వ్యవహరించనున్నారు. ఇదిలా ఉండగా.. మహేశ్వరం నుంచి కాంగ్రెస్ బరిలో చాలా మంది ఆశావహులు ఉన్నప్పటికీ ఎవరికి అవకాశం రాలేదు. పారిజాతను గుర్తించి.. ఏకంగా రెండు నియోజకవర్గాలకు బాధ్యురాలిగా నియమించడం గొప్ప విశేషమని పార్టీ నాయకుల చెప్పగా.. ఈ అవకాశం ఇచ్చిన పార్టీ పెద్దలకు పారిజాత కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ విజయానికి కృషి చేస్తామని ఆమె చెప్పారు.

### సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

హస్తినాపురం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలో నందనవనం కాలనీలో ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డుల పంపిణీ కాంపును ప్రారంభించి మాట్లాడారు. పేదల ఆరోగ్య సంరక్షణ కోసం ఆరోగ్యశ్రీలో రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచిన సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు.

# 'విజయభేరి'కి కదంతొక్కిన జనం

- సాయంత్రం 4 గంటల నుంచే సభ ప్రాంగణానికి చేరుకున్న కార్యకర్తలు
- ఈలలు, కరతాళ ధ్వనులతో హోరెత్తిన ప్రాంగణం
- కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్



బహిరంగ సభకు తరలివస్తున్న కార్యకర్తలు, అభిమానులు

మహేశ్వరం/తుక్కుగూడ: జాతీయ పార్టీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో తుక్కుగూడలో జరిగిన 'విజయభేరి' బహిరంగకు రాష్ట్ర నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సభ ప్రాంగణానికి సాయంత్రం 4 గంటల నుంచి.. సభ ముగిసేవరకు జనం వస్తూనే ఉన్నారు. ప్రాంగణం చుట్టూ లోపలికి దారులు ఏర్పాటు చేయగా.. సభకు వచ్చే వారిని పోలీసులు తనిఖీ చేసి పంపించారు. సాయంత్రం 5 గంటల నుంచి బొంగుళూరు గేటు నుంచి తుక్కుగూడ వరకు ఔటర్ సర్వీస్ రోడ్లు రెండు వైపులా వాహనాలతో స్తంభించిపోయాయి. దీంతో సభకు వచ్చిన వారు తమ వాహనాలను ఔటర్ సర్వీస్ రోడ్ల పక్కన, ఫ్యాబ్ సిటీ ఖాళీ ప్రదేశాల్లో పార్కింగ్ చేశారు. వేదిక చుట్టూ రోడ్లన్నీ సుమారు 6 కిలో మీటర్ల మేర వాహనాల రద్దీతో నిండిపోయింది. సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, డీకే శివకుమార్, రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు వేదికపైకి చేరి అభివాదం చేయగానే.. సభకు వచ్చిన జనం ఈలలు, కేరింతలతో హోరెత్తించారు. సభ ముగిసిన అనంతరం గేట్లను తోసుకుంటూ ఒక్కసారిగా బయటకి వచ్చేశారు. దీంతో గంటసేపు రోడ్లన్నీ వాహనాలు, జనాలతో స్తంభించిపోయాయి. పోలీసులు, పార్టీ నాయకులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

**నియోజకవర్గం నుంచి..**

మహేశ్వరం నియోజకవర్గం నుంచి విజయభేరికి భారీగా జనాన్ని తరలించారు. మహేశ్వరం, కందుకూరు, జల్‌పల్లి, బడంగ్‌పేట్, మీర్‌పేట్, సరూర్‌నగర్ డివిజన్, ఆర్‌కేపురం డివిజన్ల నుంచి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్, టీపీసీసీ జనరల్ సెక్రటరి చిగురింత పారిజాత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, జంగారెడ్డిలు జనాన్ని తరలించారు.



సభ ముగిసిన అనంతరం తిరుగుముఖం పట్టిన అభిమానులు



సభలో ఏర్పాటు చేసిన భారీ కటౌట్లు



ఔటర్ సర్వీస్ రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు